క్లుప్తంగా

గంగమ్మకు నెల పొంగళ్లు


గంగమ్మకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

రాపూరు: మండలంలోని రామిరెడ్డిపల్లెలో గంగమ్మ కొలుపు జరిగి నెల రోజులు పూర్తి అయిన నేపథ్యంలో ఆదివారం గ్రామస్తులు నెల పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కొలుపు జరిగిన నెల రోజులకు నెల పొంగళ్లు పెట్టడం గ్రామ ఆచారమని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని మహిళలంతా పొంగళ్లకు కావాల్సిన సామగ్రితో గ్రామ చివర ఉన్నన గంగమ్మ చెట్టు వద్దకు చేరుకుని పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొనింది.

శ్మశాన సమస్య పరిష్కారం


శ్మశానానికి వేసిన రోడ్డు

దొరవారిసత్రం: మండలంలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీ శ్మశాన సమస్య పరిష్కారమైంది. ఎవరైన మృతి చెందితే మృతదేహాన్ని శ్మశానికి తీసుకు వెళ్లడానికి దారిలేక నానా ఇబ్బందులు పడేవారు. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించిన సర్పంచ్ నాగూరయ్య డీవీ సత్రం వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకు వెళ్లారు. దీంతో ఆయన మండల పరిషత్ నిధుల నుంచి రూ.2.30 లక్షల మంజూరు చేయించారు. ఈ నిధులతో రోడ్డు, శ్మశానంలో నీటి వసతి కోసం బోరు తవ్వించారు. దీంతో శ్మశాన సమస్య పరిష్కారమైంది

నాగాలమ్మ ఆలయంలో పూజలు


నాగాలమ్మకు అభిషేకం చేస్తున్న భక్తులు

వాకాడు: బాలిరెడ్డిపాళెంలోని సుబ్రమణ్యంస్వామివారి ఆలయ ఆవరణలో ఉన్న నాగాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఆషాడ శుద్ధ చతుర్దశి సందర్భంగా అర్చకులు దీవి అనంతాచార్యులు ఆధ్వర్యంలో సుబ్రమణ్యస్వామివారికి శుద్ధ చతుర్దశ కలశ స్నపన తిరుమంజనం, 14 రకాల ద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు పెళ్లేటి శ్రీనివాసులురెడ్డి, సునీత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో దీవి తేజోవతి, గురుప్రసాద్, బాలాజీశెట్టి, పోలమ్మ, పోలయ్య పాల్గొన్నారు. అలాగే ఆలయ ఆవరణలోని నాగాలమ్మకు భక్తులు అభిషేక పూజలు చేశారు.

నూతన కార్యవర్గం


నూతన డివిజన్ కమిటీ సభ్యులు

నాయుడుపేటటౌన్: గ్రామ, వార్డు సచివాలయల ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయుడుపేట డివిజన్ కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. నాయుడుపేట డివిజన్ అధ్యక్షుడిగా బండి గోపి, కార్యదర్శిగా కాళహస్తి రామస్వామి, ఉపాధ్యక్షుడిగా షేక్ సర్దార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా అంబటి సుధీర్, సంయుక్త కార్యదర్శిగా సీహెచ్ నవీన్, అదనపు కార్యదర్శిగా కే బాలు, కోశాధికారిగా ఎస్ రామారావు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. రాష్ట్ర నాయకులు రహీం, సురేష్, జిల్లా నాయకులు ఆశోక్ రాజ్ తదితరుల సారథ్యంలో పట్టణంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడి ఎల్లయ్య

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై నడిచి వెళుతున్న ఓ వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. ఏకొల్లు ఎస్సీ కాలనీకి చెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి చింతా ఎల్లయ్య(68) దొరవారిసత్రం వద్ద జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా చెన్నై వైపు నుంచి నెల్లూరు వైపునకు వెళ్లే గుర్తుతెలియన వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈప్రమాదంలో ఎల్లయ్య తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాయుడుపేట తరలించగా అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతి తరలించారు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 22,071 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నా టికి 22.071 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశ యం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,950 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు 120 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంగ జలం..తీరనున్న దాహం

తాగునీటి సమస్యతో సతమతమవుతున్న సూళ్లూరుపేట వాసుల వెతలు తీర్చడానికి రాష్ట్రప్రభుత్వం ముందడుగు వేసింది. తెలుగు గంగ జలం తీసుకొచ్చి ప్ర'జల' కష్టాలను శాశ్వతంగా తీర్చనుంది. ఇందులో భాగంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, ఓవర్ హెడ్ ట్యాంకులు, తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి పైప్‌లైన్ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ పనులు పూర్తి అయితే ఇంటింటా జలసిరులు ఉప్పొంగనున్నాయి.

- సూళ్లూరుపేటలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- ఏఐఐబీ నిధులు రూ.142.10 కోట్లతో పనులు
- నాలుగు చోట్ల భారీ ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం
- తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి జలం


మంగళంపాడు చెరువు నుంచి సూళ్లూరుపేటకు వేస్తున్న పైపులైన్

సూళ్లూరుపేట: పురపాలక సంఘం పరిధిలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. సుమారు 75 వేల మంది జనాభా సూళ్లూరుపేటలో ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే ఏడాది ప్రథమార్థానికి పట్టణ ప్రజలు తాగునీటికి కొనుగోలు చేసే పరిస్థితి నుంచి విముక్తి కల్పించనున్నారు. తెలుగుగంగ ప్రధాన కాలువ నీటిని పట్టణానికి తీసుకొచ్చి, తాగునీటి కొరతను తీర్చే దిశగా పనులు జరుగుతున్నాయి. గత టీడీపీ పాలకులు 2019లో సూళ్లూరుపేటలో తాగునీటి సమస్యను శాశ్వతంగా తాగునీటి పనులకు సంబంధించిన శిలాఫలకం వేసినప్పటికీ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే చందంగా ముందుకు సాగలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దీని ప్రత్యేక దృష్టి సారించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఏషియన్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్ నిధులు రూ.142.10 కోట్ల నిధులు మంజూరు చేయించారు. దీంతో తాగునీటి సమస్య పరిష్కారానికి సంబంధించిన పనులు చేస్తున్నారు.

మంగళంపాడు చెరువుకు తెలుగుగంగ జలం

తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి పైపులైన్ ద్వారా సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు చెరువులో కొంత భాగంలో సమ్మర్‌స్టోరేజీగా మార్చి, నీటిని నిల్వ చేయడానికి ప్రణాళికలు రూపొందించారు. ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి తిరుపతి ఐఐటీ విద్యార్థులతో డిజైన్ చేయించి పనులు చేస్తున్నారు. ఆ సమ్మర్ స్టోరేజీలో నీటిని శుద్ధి చేసేందుకు ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు ముమ్మరంగా పనులు కూడా జరుగుతున్నాయి. ఇప్పటికే బుచ్చినాయుడు కండ్రిగ నుంచి సూళ్లూరుపేట వరకు 25 కిలోమీటర్లు మేర పైపులైన్ పనులను పూర్తి చేశారు. అలాగే పట్టణంలో 75 కిలోమీటర్లు దూరం పైపులైన్లు పనులు కూడా పూర్తి చేశారు.

నాలుగు భారీ ఓవర్‌హెడ్ ట్యాంకులు

ఈ పథకంలో భాగంగా సూళ్లూరుపేట మున్సిపాలిటీలో మన్నారుపోలూరు మిట్టమీద 9లక్షల లీటర్లు సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్, సూళ్లూరు దళిత కాలనీలో 3 లక్షలు, కళాక్షేత్రంలో 12 లక్షలు, ఇసుకమిట్టలో 11 లక్షలు సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం పనులు కూడా జరుగుతున్నాయి. ఈ పథకం పనులు పూర్తయితే సూళ్లూరుపేట పట్టణ ప్రజలకు శాశ్వతంగా తాగునీటి సమస్య తీరడమే కాకుండా శుద్ధి జలం కూడా అందనుంది.


మన్నారుపోలూరు వద్ద నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంక్

ఏపీ ఈ-సెట్‌లో విద్యార్థి ప్రతిభ


మిసిత్

కోట: మండలంలోని మద్దాలి కండ్రిగ గ్రామానికి చెందిన చిట్టేటి మిషిత్ అనే పాలిటెక్నిక్ విద్యార్థి ఆదివారం విడుదలైన ఏపీ ఈ-సెట్ ఫలితాల్లో సిరామిక్ టెక్నాలజీ విభాగంలో మొదటి ర్యాంక్ సాధించాడు. గూడూరులోని గవర్నమెంటు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్ టెక్నాలజీలో మిషిత్ పాలిటెక్నిక్ చదువుతున్నాడు. ఏపీ ఈ-సెట్ సిరామిక్ టెక్నాలజీ విభాగంలో 27 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా తనకు మొదటి స్థానం దక్కినట్లు విద్యార్థి మిషిత్ తెలిపాడు.

జగనన్న సురక్ష పక్కాగా నిర్వహించాలి

సైదాపురం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు అన్నారు. ముండలంలోని చాగణం సచివాలయంలో ఆదివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేపై సమీక్షించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వందశాతం మంది పేదలకు సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ పురుషోత్తం శివకుమార్ తదితరులున్నారు.

సైదాపురంలో నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ పర్యటన

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో సోమవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ పర్యటించనున్నట్లు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె సదారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు సైదాపురంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారన్నారు. అనంతరం 2 గంటలకు గూడూరు, కావలి మీదుగా గుంటూరుకు చేరుకుంటారని ఆయన పేర్కొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వెంకటగిరిరూరల్: మండలంలోని చెలికంపాడు పంచాయతీలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

నేడు నెల్లబల్లిలో

పెళ్లకూరు: మండలంలోని నెల్లబల్లి సచివాలయ పరిధిలో సోమవారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

జగనన్న సురక్షలో 11 రకాల ఉచిత సేవలు

వాకాడు: ప్రజల వద్దకే పాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలను ఉచితంగా అందజేస్తున్నట్లు వాకాడు-2 సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రవీంద్ర తెలిపారు. ఆదివారం ఆయన వాకాడులో మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 27వ తేదీ వరకు వాకాడు సచివాలయంలో నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పలు ధ్రువీకరణ పత్రాలతోపాటు అర్హత కల్గిన వివిధ పథకాల మంజూరు కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. చివరి రోజున మీరు కోరిన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేస్తామని రవీంద్ర తెలిపారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన


రాపూరు పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

రాపూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఆదివారం సాయంత్రం వెలుగోను గ్రామానికి చెందిన గిరిజన సంఘం నాయకులతో కలసి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. వెలుగోను గ్రామానికి చెందిన మల్లికా ప్రభావతి తన భూముల్లో సాగు చేసిన మామిడి చెట్లను కొంతమంది గ్రామస్తులు ధ్వంసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఎస్టీలు, యానాది సంఘం నాయకులతో కలసి స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో పోలీస్ స్టేషన్ ఎదుట ఉద్రిక్తత చోటుచేసుకుంది. సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ పోలీసు ఉన్నతాధికారులతో చర్చించి ఆందోళనను విరమింపజేశారు. గిరిజనులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు. ఈ ఆదోళనలో యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పెంచలయ్య, గిరిజనులు పాల్గొన్నారు. అంతకుముందు వెలుగోనులోని భూములో నిర్వహిస్తున్న జాయింట్ సర్వేని గిరిజనునలు అడ్డుకున్నారు. ఒక్క ఎస్టీల భూములోనే కాకుండా గ్రామ పరిధిలోని ఆర్ఎఫ్ భూములను కూడా సర్వే చేయాలని బైఠాయించారు. మరో రోజు సర్వే చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఆందోళన సద్దుమణిగింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు


గాయపడిన శివయ్య

సైదాపురం: మండలంలోని సిద్ధలయ్యకోన రోడ్డు వద్ద ఆదివారం వాహనం అదుపుతప్పి పడి ఓ గుర్తు తెలియని యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది కథనం మేరకు.. సముద్రాల వారి కండ్రిగకు చెందిన రాకేష్ ఏపీ 39 ఎస్ఎఫ్ 3451 నంబర్ మోటార్‌సైకిల్‌కు సైదాపురం గ్రామానికి వచ్చాడు. ఇక్కడ మద్యం తాగి తిరిగి స్వగ్రామానికి వెళుతూ మద్యం మత్తులో అదుపుతప్పి సిద్ధలయ్యకోన రోడ్డు వద్ద పడిపోయాడు. ఈ సంఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అక్కడికి సమీపంలోని కాలనీ వాసులు రోడ్డు పక్కన మోటార్‌సైకిల్‌తోపాటు అపస్మారస్థితిలో పడి ఉన్న యువకుడి గుర్తించి 108కు సమాచారమిచ్చారు. దీంతో ఆ వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని అపస్మారకస్థితిలో పడి ఉన్న యువకుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని చింతవరం కొత్తపాళెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు జిల్లా గంగన్నపాళెం గ్రామానికి చెందిన శివయ్య మరో వ్యక్తితో కలసి కొత్తపాళెంలోని మామ ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో శివయ్య గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అతనిని మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపాల్ తెలిపారు.

మెరుగైన సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

గూడూరు: స్టేట్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని, అప్పుడే ఉద్యోగులైన మనకు అనవరమైన సదుపాయాలు అందుతాయని ఆ బ్యాంకు స్టాఫ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక పీవీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ తిరుపతి మాడ్యూల్ గూడూరు రీజియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. యూనియన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నియమ నిబంధనలతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ జీ అరుణ్‌కుమార్, జీడీఎస్ కేవీఎస్ఎన్ మూర్తి, ఏజీఎస్‌లు గిరిధర్, విరూపాక్షరాజు, రీజినల్ సెక్రటరీ వినయ్, సన్నత్, నజీర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి ముస్తాబవుతున్న భవనాలు


నెలబల్లిలో ప్రారంభానికి సిద్ధం అవుతున్న ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాలు

దొరవారిసత్రం: మండలంలో నిర్మిస్తున్న పలు ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల భవనాలు ప్రారంభానికి ముస్తాబవుతున్నాయి. మండలంలో 11 గ్రామ సచివాలయాలున్నాయి. సచివాలయాల భవనాలతోపాటు ఆర్బీకేలు, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల కోసం భవనాల నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా నెలబల్లి, పోలిరెడ్డిపాళెంలో నిర్మిస్తున్న ఆర్బీకే, హెల్త్ సెంటర్ భవనాల పనులు పూర్తి కావచ్చాయి. ఈ భవనాలను త్వరలో ప్రారంభించడానికి ముస్తాబు అవుతున్నట్లు సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు తెలిపారు. వీటితోపాటు మరిన్ని గ్రామాల్లో సచివాలయాలతోపాటు ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల కోసం చేపట్టిన భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.


కరపత్రాల ఆవిష్కరణ

గూడూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఏబీవీపీ నేతలు పిలుపునిచ్చారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఆదివారం బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా నాయకుడు చిన్నా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఏబీవీపీ నాయకులు చైతన్య, రోహన్, రవి పాల్గొన్నారు.

గురు పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు


విద్యుత్ దీపాలంకరణలో సాయిబాబా మందిరం


ఓజిలి: సాయినాథుని విద్యుత్ కటౌట్


నాయుడుపేటటౌన్: అగ్రహారపేటలో వెండిసింహాసనం షిరిడీ సాయిబాబా

గూడూరు: పట్టణంలోని షిరిడీ సాయి మందిరంలో గురుపూర్ణమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం గురుపూర్ణిమ పురస్కరించుకుని గత నెల 26వ తేదీ నుంచి అఖండ నామ సప్తాహం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 8 గంటలకు ముగుస్తుంది. వేకువ నుంచే కాగడ హారతితో గురుపూర్ణిమ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం అభిషేకం, అష్టోత్తర పూజ, శ్రీ విష్ణు పారాయణం, ధునిపూజ, సత్యసాయి వ్రతం, దత్తాభిషేకం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. రాత్రి బాబా పల్లకీ సేవ వైభవంగా జరుగుతుందన్నారు.

గురుపూర్ణిమ వేడుకలు ప్రారంభం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం నుంచి గురుపూర్ణిమ మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. తెల్లవారుజామున మేలుకొలుపు పూజతో వేడుకలను ప్రారంభించారు. బాబాను పట్టుపీతాంబరాలతో అలంకరించి, వెండి సింహాసనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి బాబాకు ప్రత్యేక పలకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉభయ దాతలతో పాటు ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు గురుపూర్ణిమ వేడుకలు

గురుపూర్ణిమ సందర్భంగా సోమవారం తెల్లవారు జామున 5 గంటల నుంచి అగ్రహారపేట, బ్రాహ్మణ వీధిలోని సాయిబాబా ఆలయాల వద్ద భక్తుల ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం, రాత్రి వరకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న షిరిడీ సాయి బాబా మందిరం వార్షికోత్సవం, గురుపూర్ణిమ వేడుకల సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరామ్ ప్రసాద్, ఉభయదాతలు తదితరులు పాల్గొన్నారు.

గురుపౌర్ణమికి ప్రత్యేక ఏర్పాట్లు


ఓజిలి: గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని మానమాలలోని బాబా మందిరం ముస్తాబవుతోంది. ఉదయం 5 గంటలకు కాగడా హారతి, 6 గంటలకు శ్రీసాయి జయజయసాయి నామం ప్రారంభం, 10 గంటలకు రుద్రాభిషేకం, మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, రాత్రి భజన, పల్లకీ సేవ, సేజ్ హారతి, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


వైభవంగా సాయిబాబా గ్రామోత్సవం

సైదాపురం: మండల కేంద్రం ఉన్న షిరిడీసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా రెండు రోజుల పాటు జరిగే వేడుకల్లో భాగంగా ఆదివారం బాబా గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బాబాకు విశేషాలంకరణ చేసి వాహనంలో కొలువుదీర్చి, ఊరేగించారు. ఉదయం బాబాకు అభిషేకం చేశారు. వందలాది మంది భక్తులు బాబాను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించన్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా నగర సంకీర్తన

వాకాడు: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం వాకాడులో సాయిబాబా భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా మందిర కమిటీ ఆధ్వర్యంలో భక్తులు ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాల నడుమ భక్తి గీతాలు ఆలపిస్తూ సాయిబాబా పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.


సైదాపురంలో బాబా ఊరేగింపు


వాకాడు: విశేషాలంకరణలో బాబా

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి


వీరయ్య మృతదేహం

నాయుడుపేటటౌన్: ప్రమాదంలో గాయపడి, నెల్లూరులోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మేరిగ వీరయ్య(65) మృతి చెందినట్లు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. పోలీసులు కథనం మేరకు.. ఓజిలి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన వీరయ్య గత నెల 28 తేదీన మోటార్ సైకిల్‌పై నాయుడుపేట వైపు వస్తుండగా మార్గ మధ్యంలో స్వర్ణముఖి నది కాజ్‌వే వద్ద ఎదురుగా వస్తున్న కారు ఇతని బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వీరయ్య నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళమ్మకు పొంగళ్లు

గూడూరు: గ్రామదేవత తాళమ్మకు ఆదివారం పొంగళ్లు పెట్టారు. పట్టణానికి సమీపంలో ఉన్న తాళమ్మకు విశేషాలంకరణ చేసి, భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయం వద్ద చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.